## క్లుప్తంగా

### ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈఓ-2

అర్ధవీడు: మండలంలోని పాపినేనిపల్లి ఎస్సీపాలెంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన మూల వెంకట నారాయణరెడ్డిని సోమవారం ఎంఈఓ లక్ష్మీ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో నారాయణరెడ్డి బాధ్యతగా పనిచేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సలోమి, రసూల్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### పీర్లను దర్శించుకుంటున్న భక్తులు



మకానాలో కొలువుదీరిన పీర్లు

మార్కాపురం టౌన్: మొహర్రం పండగను పురస్కరించుకని మార్కాపురం పట్టణంలోని గౌర్లగడ్డ, తూర్పువీధి మంగళవారం మకానాల్లో పీర్లు కొలువుదీరాయి. పది రోజుల పాటు మత సామరస్యానికి చిహ్నంగా పీర్లపండగను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పట్టణంలోని గౌర్లగడ్డ పీర్లచావిడిలో పీర్లను సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. మకానాలో బాదుల్లా సాహెబ్, బారా ఇమామ్, రంగు హుస్సేనీ, గొట్టిపడియ ఖాశీం సాహెబ్, ఇమామ్, హుస్సేన్ పీర్లు, తూర్పువీధులోని చిన్నబాదుల్లా, సాహెబ్ పీరు ప్రసిద్ధి చెందింది. ఆర్టీసీ బస్టాండ్, విజయ టాకీస్, పూలసుబ్బయ్య కాలనీలోని పీర్లు, నాగులవరం రోడ్డులో మకాన్‌లో ఉన్న పీర్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

### రెండు కార్లు ఢీ



ప్రమాదానికి గురైన కారు

మార్కాపురం టౌన్: రెండు కార్లు ఢీకొన్న సంఘటన సోమవారం అనంతపురం-అమరావతి హైవేపై ఉన్న మార్కాపురం మండలం చింతగుంట్ల వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కంభం నుంచి మార్కాపురం వైపునకు వస్తున్న కారు, మార్కాపురం నుంచి కంభం వైపుకు వెళ్తున్న కారు చింతగుంట్ల గ్రామం వద్ద ఢీకొన్నాయి. ఓ కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి ఢీకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### చిల్లకంప తొలగింపు



చిల్లకంపను తొలగింపజేస్తున్న జగన్‌బాబు

తర్లుపాడు: ఎన్నికల్లో గెలిస్తే అది చేస్తాం.. ఇది చేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే రాజకీయ నాయకులు గెలిచిన తర్వాత సమస్యల వైపు కన్నెత్తి కూడా చూడక పోవడంతో ప్రజలు ఇదేమి ప్రభుత్వమంటూ నిలదీస్తున్నారు. ఓ ఉపాధ్యాయుడు సామాజిక బాధ్యతతో చేపట్టిన పని పలువురి ప్రశంసలు అందుకుంటోంది. వివరాలు.. మండల కేంద్రం తర్లుపాడు నుంచి తుమ్మలచెరువు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి చిల్లచెట్లు పెరిగి వాహన దారులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రమాదాలు జరుగుతుండటంతో జగన్నాథపురం ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న కశ్శెట్టి జగన్‌బాబు సొంత నిధులతో జేసీబీ సాయంతో సుమారు 5 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించారు. దీంతో వాహనదారులు ఉపాధ్యాయుడు కృషిని కొనియాడారు. పాలకులు చేయలేని పని ఓ పాఠశాల హెచ్ఎం సామాజిక బాధ్యతతో చిల్లచెట్లను తొలగించడంపై పలువురు అభినందించారు.

### మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

కొనకనమిట్ల: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 11 సంవత్సరాలు పరిపాలన పూర్తయిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పార్టీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిరసనగుండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పాలనలో ప్రధాని మోదీ అన్నీ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారని కొనియాడారు. అనంతరం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతానికి కార్యవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. జిల్లా నాయకులు ఎస్.శ్రీనివాస రెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, సరోజినీదేవి, మండల అధ్యక్షుడు కేవీఆర్ ప్రసన్నాంజనేయులు, మాజీ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అవినీతిపై విచారణ చేయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బేస్తవారిపేట: ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేయించాలని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు నన్నెబోయిన రవికుమార్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి వేగినాటి ఓసూరారెడ్డి అన్నారు. ఒంగోలులోని 'మీ కోసం' కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టం మేరకు ఉపాధిహామీ పనులు గ్రామ పంచాయతీల ద్వారానే జరిపించాలని కోరారు. సర్పంచ్‌లకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేయాలన్నారు. కేంద్రం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులు రూ.1,150 కోట్లు స్థానిక సంస్థలకు తక్షణమే జమచేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గాల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు కోటేశ్వరరావు, రామాంజనేయులు, సుబ్బారెడ్డి, మల్లెల శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలని వినతి**



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అర్జీదారులు

మార్కాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు అర్జీదారులు సోమవారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసంలో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు అర్జీలు సమర్పించారు. అర్ధవీడు మండలం బొల్లుపల్లికి చెందిన శ్రీనివాసులు మాజీ సైనికుల కోటాలో తనకు పొలం కేటాయించారని, తన పేరు ఆన్‌లైన్‌లో ఎక్కించాలని అర్జీ ఇచ్చారు. కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామానికి చెందిన షేక్ కరిష్మా తన రేషన్‌కార్డులో వేరేవారి పేర్లు నమోదయ్యాయని, వారి పొలాలు, ఆస్తులు తమ పేర నమోదు కావడంతో తల్లికివందనం రాలేదని, వాటిని తొలగించి తమ ఒరిజినల్ ఆస్తులు, స్థలాలు అలాగే ఉంచి తల్లికి వందనం తమ పిల్లలకు ఇవ్వాలని కోరారు. యర్రగొండపాలెం పట్టణానికి చెందిన సత్యనారాయణ యూనియన్ బ్యాంకు బజారులో నీటి సరఫరాకు ఇబ్బందులు పడుతున్నామని, నీరు సరఫరా చేయాలని వినతిపత్రం ఇచ్చారు. ఇంకా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు అర్జీలు ఇచ్చారు. ఆయా శాఖల అధికారులు వీటిని పరిష్కరించాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు.

# వీళ్లింతే మారరంతే !

- గ్రీవెన్స్‌కు నిత్యం దుమ్మా కొడుతున్న అధికారులు



సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కూర్చొని ఉన్న ఆరుగురు అధికారులు

కంభం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారానికొకసారి తహసీల్దార్ కార్యాలయంలో జరిగే మీకోసం కార్యక్రమంలో అధికారులు గైర్హాజరవుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మీకోసం కార్యక్రమానికి 18 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కంభం తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం పది మందికి మించి హాజరు కావడం లేదు. వచ్చిన వారిలో సగం మంది సంతకం చేసి కొద్దిసేపు కూర్చుని వెళ్లిపోతున్నారు. వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చి అర్జీలు సమర్పించే ప్రజలకు అక్కడ జరిగే మీకోసంలో అన్ని శాఖల అధికారులు లేకపోవడంతో వారి సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకం కలగడం లేదు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ వి.కిరణ్‌ను వివరణ కోరగా మీకోసంకు హాజరు కాకపోవడంపై గతంలో పలుమార్లు నోటీసులు ఇచ్చామని, అయినా కొందరు హాజరు కావడం లేదని గైర్హాజరవుతున్న వారిపై కలెక్టర్‌కు రిపోర్టు రాసి పంపిస్తున్నట్లు తెలిపారు.

# రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు



సమావేశంలో అభివృద్ధి అంశాలను వివరిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: మున్సిపల్ పరిధిలో మొత్తం 27 అంశాలతో రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సమస్య, ఇతర మౌలిక వసతులపై శ్రద్ధ చూపుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ ఈ.వి.రమణ బాబు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# శివశంకరరెడ్డి సేవలు మరువలేనివి



రిటైర్డ్ కార్యదర్శికి సన్మానం చేస్తున్న ఎంపీపీ

గిద్దలూరు రూరల్: పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన వీరంరెడ్డి శివశంకరరెడ్డి సేవలు మరువలేనివని స్థానిక ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. మండలంలోని నరవ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆయనకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివశంకరరెడ్డి ప్రజలతో స్నేహ భావంతో మెదులుతూ ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా సమయస్ఫూర్తితో ఉద్యోగ ధర్మం నిర్వర్తిస్తూ ముందుకు సాగాడని కొనియాడారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీగా పనిచేస్తున్న చెన్నారావు కొమరోలు మండలానికి బదిలీ పై వెళ్లిన సందర్భంగా ఆయనకు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కడప వంశీధర రెడ్డి, కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బూతేశ్వరరెడ్డి, రాఘవరావు, నాగసుధా, సిబ్బంది ప్రతాప్ పాల్గొన్నారు.

### శ్వేత వారాహి అలంకారంలో జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కండేశ్వరస్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారు శ్వేత వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం జగదాంబ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఆలయ అర్చకులు ఆంజనేయ ప్రసాద్, వరుణ్‌తేజ బృందం ప్రత్యేక అలంకారం నిర్వహించి పూజలు చేసింది. జగదాంబ అమ్మవారు శ్వేత వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



శ్వేత వారాహి అలంకారంలో అమ్మవారు

# 1074 కౌలు కార్డులు జారీ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

కొమరోలు: 2025-26వ సంవత్సరానికి మండలంలో 1074 కౌలు కార్డులు జారీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. కొమరోలులోని తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతులకు సోమవారం పంట సాగు హక్కు పత్రం జారీపై వీఆర్‌ఓలకు, వీఏఏలకు, ఉద్యాన, పట్టుపరిశ్రమల సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 343 కౌలు కార్డులు మాత్రమే జారీ చేశారన్నారు. కార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమే అని, భూయజమానులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పంట మీద మాత్రమే కౌలు రైతులు హక్కు కలిగి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి రాజశ్రీ పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

అర్ధవీడు: మండల కేంద్రమైన అర్ధవీడు పట్టణంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కల్వకూరి అబ్రహం సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు రాజేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# మోకాళ్లపై నిల్చొని మున్సిపల్ కార్మికుల నిరసన




మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మార్కాపురం టౌన్: సమాన పనికి సమాన వేతనం 21 వేల రూపాయల జీతం ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరికృష్ణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్డ్‌మెంటు బెనిఫిట్స్ కల్పించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇమాంసా, అల్లూరయ్య, శేఖర్, కనకయ్య, సలాంఖాన్, కేశవ పాల్గొన్నారు.

# బీసీ బాలికల హాస్టల్‌కు శాశ్వత భవనం నిర్మించాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఎల్‌పీ యాదవ్

మార్కాపురం: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసే బీసీ బాలికల హాస్టల్‌కు శాశ్వత భవనం మంజూరు చేయించాలని బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పి యాదవ్ సబ్ కలెక్టర్ త్రివినాగ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రెండేళ్ల నుంచి తాము బీసీ సంఘం తరపున బీసీ బాలికల సంఘం ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తి మేరకు బీసీ హాస్టల్ త్వరలో ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. మార్కాపురం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 నుంచి 200 మంది విద్యార్థినులు మార్కాపురానికి వచ్చి చదువుకుంటారని, వారందరికీ నూతనంగా ఏర్పాటు చేయబోయే బీసీ బాలికల వసతి గృహంలో ప్రవేశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

హాస్టల్ మంజూరు చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. బీసీ సంఘ నాయకులు రంగస్వామి గౌడ్, రాజ్‌కుమార్, చెంచయ్య యాదవ్ పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన




ఆపరేషన్లు చేయించుకున్న వారికి సూచనలు ఇస్తున్న డాక్టర్ సురేఖ

కొనకనమిట్ల:

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ వైద్యశాల డాక్టర్‌లు సురేఖ, విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు మహిళలకు కుటుంబ సంక్షేమ ఆపరేషన్లు నిర్వహించి వారికి ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. 30 మంది మహిళలకు కుటుంబ సంక్షేమ ఆపరేషన్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్లు చేయించుకున్న మహిళలకు ప్రభుత్వం అందించే పారితోషికం త్వరలో వారి బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని డాక్టర్ సురేఖ తెలిపారు.




# పశ్చిమ ప్రాంతంలో ఆధునిక వైద్యసేవలు



మార్కాపురం/గిద్దలూరు రూరల్: ఒకప్పుడు వైద్యసేవలు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యేవి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. సాధారణ వైద్యులే కాకుండా స్పెషలిస్టు వైద్యులు సైతం మండల కేంద్రాల్లో సేవలందిస్తున్నారు. ఒకప్పుడు అత్యాధునిక వైద్యసేవలు కావాలంటే సుదూర ప్రాంతాలైన నంద్యాల, గుంటూరు, ఒంగోలుకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మార్కాపురం, గిద్దలూరు వంటి పట్టణాల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలను అందించే వివిధ ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. మార్కాపురం పట్టణంలోని సీతారామ శాస్త్రి హాస్పిటల్, పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న శశాంక్ ఈఎన్‌టీ హాస్పిటల్, గిద్దలూరులోని డాక్టర్ హరినాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీజీఆర్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల, డాక్టర్ జీవీ నారాయణ లిటిల్ స్టార్స్ చిల్డ్రన్ హాస్పిటల్ తదితర ఆస్పత్రులు అత్యాధునిక వైద్యసేవలను ప్రజలకు చేరువ చేశాయి.